# ప్రజాశక్తి

గురువారం 9 నవంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి


# ఉక్కుపై తాడోపేడో తేల్చుకుంటాం

- ప్రైవేటీకరిస్తే ఊరుకోం : స్టీల్‌ప్లాంట్ కార్మికులు, పోరాట కమిటీ నేతలు హెచ్చరిక
- కూర్మన్నపాలెం కూడలి వద్ద మహాదీక్ష
- వెయ్యి రోజులుగా సహకరించిన ప్రజానీకానికి కృతజ్ఞతలు
- భవిష్యత్తులో మోడీ సర్కారుపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక

కూర్మన్నపాలెం కూడలిలో బైఠాయించిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై మోడీ సర్కారు మొండిగా ముందుకెళ్తే ఊరుకునేది లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు పరిరక్షణ పోరాటం వెయ్యి రోజులకు చేరుకున్న సందర్భంగా బుధవారం విశాఖలో 'ఉక్కు' నినాదం హోరెత్తింది. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్దనున్న పోరాట కమిటీ దీక్షా శిబిరం వద్దకు కార్మికులు కుటుంబాలతో సహా పోటెత్తారు. మహా దీక్ష చేపట్టారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, టిడిపి, జనసేన, కాంగ్రెస్, ఆప్, ప్రజాశాంతి పార్టీల నాయకులు అక్కడకు వచ్చి సంఘీభావం ప్రకటించారు.

వందలాదిగా తరలివచ్చిన కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ నిరంతర పోరాటాల వల్లే ప్లాంట్‌ను కాపాడుకోగలిగామన్నారు. ఇప్పటి వరకూ కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు తలపెట్టిన కార్యక్రమాలను వివరించారు. కేంద్ర మిగతా 2లో..

వార్తలు 8లో..

బంద్‌తో విద్యార్థులు కానరాని విశాఖలోని కృష్ణా కాలేజీ

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

హోరెత్తిన ఉక్కు నినాదాలు

## రౌడీషీటర్ హత్య కేసులో.. ముగ్గురికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో 2011లో జరిగిన హత్య కేసుకు సంబంధించి ముగ్గురికి జీవిత ఖైదు, జరిమానా న్యాయస్థానం విధించినట్లు విశాఖపట్నం డీసీపీ (లా అండ్ ఆర్డర్) - 1 ఎ.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011లో ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రౌడీ షీటర్ పందిరి రవి హత్య కేసులో ప్రధాన నిందితులు ఏడుగురిలో ముగ్గురికి జీవిత కారాగార శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో మరొక రెండు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి లాలం శ్రీధర్ బుధవారం తీర్పు చెప్పారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన ఏడుగురిలో ముగ్గురు ఇప్పటికే మృతి చెందగా ఒక వ్యక్తి 2015 నుంచి పరారీలో ఉన్నాడన్నారు. మిగిలిన నిందితుల్లో అక్రబోయిన అప్పలరాజు, వనపల్లి శివ, ముద్దాడ అమర్‌నాథ్‌లకు శిక్ష పడినట్టు వెల్లడించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బివిఆర్.మూర్తి తీవ్రంగా కృషి చేశారని, నేరస్తులకు శిక్ష తప్పదని చెప్పడానికి ఈ కేసు ఒక ఉదాహరణని అన్నారు.

## వైజాగ్ పరిపూర్ణ ఆకర్షిత నగరం

వార్త 2లో..

## హెటిరోపై జాతీయోద్యమ నేతలకు వినతులు

వార్త 7లో..

## పిఎసిఎస్‌లో చోరీకి విఫలయత్నం

వార్త 5లో..

## డిసిఐ త్రైమాసిక నికర లాభం రూ.16.77 కోట్లు

వార్త మెయిన్‌లో..

## కెజిహెచ్‌లో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖలోని కింగ్ జార్జి ఆసుపత్రి సిఎస్ఆర్ బ్లాక్‌లో నిరంతరం విద్యుత్ ఉండేందుకుగాను ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందించే వైద్య సేవలతో పాటు రోగులకు, వారి సహాయకులకు అవసరమైన మౌలిక వసతులపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు కూడా సకాలంలో వైద్య సేవలు అందజేస్తున్న కింగ్ జార్జ్ ఆసుపత్రిలో మరిన్ని మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే ఎఆర్ మిట్టల్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో 120 కెవి సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను కెజిహెచ్‌లో ఏర్పాటు చేసిందన్నారు. త్వరలో విక్టోరియా ఆసుపత్రిలోనూ ఇలాంటి ప్లాంట్‌నే ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. మరో రూ.50 లక్షల నిధులతో చిన్నపిల్లల వసతి గృహాలను అభివృద్ధి చేయనుందన్నారు. లయన్స్ క్లబ్ సహకారంతో కెజిహెచ్‌లో రోగుల సౌకర్యార్థం మిగతా 2లో..

సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున


నాతయ్యపాలెం / గంభీరం / దేశపాత్రునిపాలెం

శివకాశి అయ్యన్ బాణాసంచా షోరూమ్

షీలానగర్: NH-5, మార్బుల్ షాప్ ఎదురుగా, నాతయ్యపాలెం, BHPV పోస్ట్, విశాఖపట్నం

గంభీరం: పైడా కాలేజి ఎదురుగా, శశి కాలేజి రోడ్, గంభీరం, విశాఖపట్నం

దేశపాత్రునిపాలెం: పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా

అయ్యన్ గ్రీన్ క్రాకర్స్ అమ్మబడును

AYYAN'S GREEN CRACKERS AVAILABLE

COMPANY FRESH ITEM   GENUINE RATES

BUNNY BRAND FANCY FIREWORKS

SIVAKASI'S Ayyan'S FIRE WORKS

For Rates Visit: www.vizagayyan.in

NH-5, Opp. Marble Shop, Natayyapalem, SHEELANAGAR, Vizag -12.

Opp. Pydah College, Sasi College Road, GAMBHIRAM, Vizag.

Paravada Mandalam, DESAPATRUNIPALEM, Anakapalli Dist.

మొదటి పేజీ తరువాయి..

## కెజిహెచ్‌లో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన రూ.50 వేలు విలువగల శాశ్వత బెంచీలను సైతం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా వైద్యులందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఎఎంసి ప్రిన్సిపల్ బుచ్చిరాజు, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ వైజాగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.మహేష్, వైస్ గవర్నర్ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

## హుండీల లెక్కింపు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఓల్డ్ టౌన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. 58 రోజులకుగాను నగదు రూపంలో రూ.38 లక్షలా 20 వేలా 413 ఆదాయం రాగా, బంగారం 116.500 మిల్లీగ్రాములు, వెండి 1 గ్రాము 25 మిల్లీ గ్రాములు, కొంత ఫారిన్ కరెన్సీ కూడా వచ్చిందని ఉప కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శిరీష మీడియాకు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆమెతోపాటు ధర్మకర్తలు బొదిలపాటి సత్య రూపవాణి, ఎం.ధనలత, ఎన్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, సురేష్, సహాయ కార్య నిర్వహణ అధికారి కె.తిరుమలేశ్వరరావు, ఎస్.వసంత కుమార్ పాల్గొన్నారు.

పూర్ణా మార్కెట్ 35వ వార్డు పరిధిలో ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు అనంతర హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. హుండీ, ముడుపుల ద్వారా రూ.14 లక్షలా 5 వేలా 407 ఆదాయం వచ్చిందని దేవస్థానం చైర్మన్ నాయన మల్లిబాబు మీడియాకు తెలిపారు. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేవస్థానం కార్య నిర్వహణ అధికారి శేఖర్ బాబు, ధర్మకర్తలు భక్తి మంగరాజు కంటిపిల్లి వరలక్ష్మి యాల రమణమ్మ, దశమంతుల చిన్ని తదితరులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న బ్యాంకు ఛైర్మన్ రాంబాబు

## కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు అవార్డు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు 'బ్యాంకో బ్లూ రిబ్బన్ అవార్డు-2023' లభించింది. ఇటీవల డామన్‌లోని డెల్టిన్ రిసార్ట్‌లో జరిగిన బ్యాంకో బ్లూ రిబ్బన్ వేడుకల్లో కనకమహాలక్ష్మి బ్యాంకు ఈ అవార్డును పొందింది. ఉత్తమ పనితీరును కనబరుస్తున్న సహకార బ్యాంకులను ప్రోత్సహించేందుకు బ్యాంకో, గెలాక్సీ ఇన్మా దేశవ్యాప్తంగా బ్యాంకర్ల స్ఫూర్తిని ప్రోత్సహించడానికి ప్రతి యేటా బ్యాంక్ బ్లూ రిబ్బన్ అవార్డులను ప్రకటిస్తాయి. దీనిలో భాగంగా ఈ ఏడాది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు ఈ అవార్డును ప్రకటించాయి. తమ బ్యాంకుకు అవార్డు లభించడం చాలా సంతోషంగా ఉందని చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బ్యాంకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఖాతాదారుల సహకారంతోనే తాము ఈ ప్రగతి సాధించగలుగుతున్నామని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైజాగ్ పరిపూర్ణ ఆకర్షిత నగరం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ నగరం పరిపూర్ణ ఆకర్షిత నగరంగా ఇతర దేశాలకు ఆదర్శప్రాయంగా ఉందని అమెరికాకు చెందిన కేరమెల్ సిటీ గౌరవ మేయర్ జేమ్స్ బ్రైనార్డ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆర్‌కె బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా తీరంలో జివిఎంసి ఏర్పాటు చేసిన 'స్వచ్ఛత ఇకో-వైజాగ్ అవార్డు' కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరం ప్రపంచంలోనే ఆకర్షణీయ నగరాలలో ఒకటిగా నిలిచిందని, ఇక్కడి అందాలు కనువిందు చేస్తాయని అన్నారు. జివిఎంసి అమలు చేస్తున్న స్వచ్ఛత ఇకో వైజాగ్ కార్యక్రమాల ద్వారా విశాఖ నగరానికి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో కూడా గుర్తింపు వస్తుందని అన్నారు. ఈ స్వచ్ఛత ఇకో వైజాగ్ అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జివిఎంసి తనను ఆహ్వానించినందుకు ఎంతో సంతోషంగా వుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్లు, వార్డు సభ్యులు, జివిఎంసి అధికారులతో కలిసి 'స్వచ్ఛత ఇకో వైజాగ్ అవార్డు' లోగోను, బ్రోచర్‌ను, స్వచ్ఛ దీపావళి డిజిటల్ సిగ్నేచర్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ విశాఖ నగరాన్ని ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాల కలిగిన పర్యావరణ నగరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమమే ఇకో-వైజాగ్ అని తెలిపారు. జివిఎంసి పరిధిలో వున్న వార్డుల అభివృద్ధి కోసం వార్డు స్థాయిలో ఆరోగ్యవంతమైన పోటీతత్వాన్ని పెంపొందిస్తున్నామన్నారు.

# ఉక్కుపై తాడోపేడో తేల్చుకుంటాం

ఉక్కు దీక్షా శిబిరంలో నర్సింగరావు, పల్లా, గంటా, బండారు, తదితరులు

ద్వారకా బస్ కాంప్లెక్స్ వద్ద నినదిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

(మొదటి పేజీ తరువాయి..)

ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రూ.5 వేల కోట్లతో ప్రారంభమైన విశాఖ ఉక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 58 వేల కోట్ల రూపాయల పన్నులు చెల్లించిందని గుర్తుచేశారు. ఉత్తరాంధ్రకే తలమానికంగా ఉన్న ఈ ప్లాంట్‌ను తొలుత పోస్కో కంపెనీకి కట్టబెట్టాలని చూశారన్నారు. దాన్ని తిప్పికొట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికీ జిందాల్ కంపెనీకి అప్పగించడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. 40 శాతం ఉత్పత్తిని తగ్గించి నష్టాలవైపు నడిపిస్తున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గపు చర్యలను బిజెపి ప్రభుత్వం విరమించుకోవాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించడమేనని అన్నారు.

పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ ఉక్కుపై అనేకసార్లు ముఖ్యమంత్రిని కలిశామన్నారు. ప్లాంట్‌పై అనేక కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు.

### రాజకీయ పార్టీల సంఘీభావం

వైసిపి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. టిడిపి మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ దేశంలో సముద్ర తీరంలోని ఏకైక కర్మాగారం విశాఖ ఉక్కు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తన అనుయాయులకు అప్పగిస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, దీన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని అన్నారు. శాసన మండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ, ప్రొఫెసర్ బాల మోహన్ దాస్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఈ ప్రాంత ప్రజలకు గొప్ప ఉపాధి కేంద్రంగా నిలిచిందన్నారు. దీన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీక్షల్లో గాజువాక మాజీ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, కెఎస్ఎన్.రావు, కారు రమణ, వైటి.దాస్, జె.రామకృష్ణ, బొడ్డు పైడిరాజు, విల్లా రామ్మోహన్ కుమార్, గణపతి రెడ్డి, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, కె.పరంధామయ్య, వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో మానవహారం

**విశాఖ కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేస్తున్న పోరాటానికి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా విశాఖ నగరంలో వామపక్ష పార్టీలు, అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వున్న గురజాడ విగ్రహం వద్ద మానవహారం, ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సాధన కోసం 32 మంది యువకిషోరాలు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. 57 మంది వామపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, పలువురు ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ సాధన కోసం రైతులు 26 వేల ఎకరాల భూములను తృణ ప్రాయంగా ఇచ్చారన్నారు. ఇంతటి త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని చెప్పారు. ఉక్కుకు మద్దతుగా విద్యార్థి, యువజన సంఘాలు చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు అచ్యుతరావు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు దేవా, ఎఐసిటియు నాయకులు కె.శంకరరావు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి, తిరుపతిరావు, సిఎఫ్‌టియుఐ నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మి, ఐద్వా నాయకులు బి.పద్మ, కె.వరలక్ష్మి, కె.మణి, పి.మణి, మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఎండి బేగం, సిపిఎం, సిపిఐ నాయకులు బి.జగన్, బి.ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, కె.క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### అల్లూరి వాకర్స్ మద్దతు

**ఎంవిపి.కాలనీ :** ఉక్కు పరిరక్షణ దీక్షలు వెయ్యి రోజులకు చేరుకున్న సందర్భంగా ఆ పోరాటానికి సీతమ్మధారలోని అల్లూరి వాకర్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది.

ఈ సందర్భంగా అక్కడ జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ఏర్పాటు నేపథ్యాన్ని వివరించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు శాంతారావు, నరసింహరాజు మాట్లాడుతూ కేంద్రం మొండి వైఖరి విడనాడాలన్నారు.

మద్దతు తెలుపుతున్న అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

## కలెక్టర్‌కు జర్నలిస్టుల కృతజ్ఞతలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో మొదటి నుంచీ సహకరిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఇదే సహకారాన్ని భవిష్యత్తులోనూ అందించాలని విజ్ఞప్తి చేసింది. సొసైటీ గౌరవ అధ్యక్షులు కెజి.రాఘవేంద్ర రెడ్డి, జి.జనార్ధన్ రావు, సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్ బుధవారం కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ స్థాపించిన నాటి నుంచి విలువైన సలహాలు, సూచనలతో సొసైటీకి సరైన దిశా నిర్దేశం చేస్తూ సహకరించిన కలెక్టర్ మల్లికార్జునకు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డుల జారీలో కలెక్టర్ ఎంతో పారదర్శకంగా వ్యవహరించారని తెలిపారు.

## జూనియర్ ఎన్‌టిఆర్ అభిమాని కుటుంబానికి సాయం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఇటీవల మరణించిన ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ పిన్నింటి కృష్ణ యాదవ్ కుటుంబానికి ఎపి, తెలంగాణ స్టేట్ వైడ్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్టేట్ వైడ్ కన్వీనర్లు అందరూ కలిసి సమకూర్చిన రూ.4 లక్షలా 25 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో స్టేట్ వైడ్ ఉత్తరాంధ్ర కన్వీనర్లు నల్లూరు సూర్యనారాయణ, నొడగల నాయుడు, దుంగా శ్రీధర్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

## మహారాణిపేటలో 'జగనన్నకు చెబుదాం'

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** మహారాణిపేటలోని టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో బుధవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 35వ వార్డ్ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తన వార్డులో పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటిని తక్షణం అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

# ఘాటెక్కిన ఉల్లి ధర..

## టమోటా ధరలకూ రెక్కలు

**ప్రజాశక్తి -తగరపువలస :** స్థానిక ప్రయివేట్ మార్కెట్‌లో గత కొద్ది రోజులుగా ఉల్లి ధర ఘాటెక్కింది. ఉల్లిపాయ కోయ కుండానే కన్నీళ్లు తెప్పిస్తోంది. టమోటా ధర కూడా పెరిగింది. కిలో ఉల్లి రూ.70 ధర పలుకుతోంది. నాసిక్ నుంచి లారీల ద్వారా విశాఖ నగరంలోని జ్ఞానాపురానికి వస్తాయని, అక్కడకు వెళ్లి కొని తెచ్చి ఇక్కడి మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తామని వ్యాపారులు చెబుతున్నారు.

**టమోటా ధరలకు రెక్కలు...**

మరో వైపు టమోటా ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. కిలో టమోటా ధర రూ.40 నుంచి రూ.50 పలుకుతోంది. బెంగుళూర్ నుంచి జ్ఞానాపురానికి లారీల ద్వారా వస్తాయని, అక్కడకు వెళ్లి కొనితెచ్చి మార్కెట్‌లో అమ్ముతామని వ్యాపారులు చెబుతున్నారు.

**వాతావరణంలో మార్పులే ధరల వ్యత్యాసానికి కారణమా?**

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు వల్లనే ఉల్లి, టమోటా ధరల్లో వ్యత్యాసం ఉంటుందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. కొంత మంది బడా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడం కూడా ధరల పెరుగుదలకు ఓ కారణమని పలువురు అంటున్నారు.

### కొనలేక పోతున్నాం

ఉల్లి ధర పెరగడంతో వాడుక తగ్గించుకున్నాం. ఉల్లితో పాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగాయి. ధరల పెరుగుదలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాం.

**అప్పలనరసమ్మ**
**సంగివలస**

### ధరలను అదుపుచేయాలి

ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలి. పేద సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

**పద్మ, తగరపువలస**

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి - ఆరిలోవ :** జాతీయ రహదారి పాతడైరీఫారం కూడలిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... ఆరిలోవ కాలనీ దర్గానగర్‌కు చెందిన కోరుకొండ అప్పలాచారి(36) కార్పెంటెర్ వృత్తి నిర్వహిస్తుంటాడు. మంగళవారం రాత్రి రణస్థలం నుంచి విధుల నిర్వర్తించుకొని తన ద్విచక్రవాహనంపై నుంచి ఆరిలోవ వస్తున్నాడు. పాతడైరీఫారం కూడలి వద్ద సిగ్నల్ పడడంతో ఆగి ఉన్నాడు. అదే సమయంలో జూ పార్కు నుంచి నగరంలోకి వెళ్తున్న లారీ ద్విచక్రవాహనం పక్కనే ఆగి ఉంది. సిగ్నల్ ఇవ్వడంతో ఆదర్శనగర్ వైపు మలుపు తిరుగుతున్న ద్విచక్రవాహనాన్ని నగరంలోకి వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ద్విచక్రవాహన నడుపుతున్న అప్పలాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ సిఐ సోమశేఖర్ ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన అప్పలాచారికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### 312 కిలోల గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి-చీడికాడ:** మండలంలోని కోణం పంచాయతీ గుంటికొత్తూరు బ్రిడ్జి వద్ద ఎస్సై రామారావుకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 312 కేజీల గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతం నుండి చీడికాడ వైపు వేగంగా వస్తున్న కారు ఆగకుండా వెళ్లి పోవడంతో పోలీసులు వెంబడించారు. నిందితులు కారు వదిలి పారిపోతున్న క్రమంలో ఇద్దరు పట్టుబడ్డారు. కారును తనిఖీ చేయగా 312 కేజీల గంజాయి లభ్యం అయింది. గంజాయి, కారు, మోటార్ సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రామారావు తెలిపారు.

### దొంగతనం కేసులో ఆరు నెలల జైలు శిక్ష

**ప్రజాశక్తి -ఆనందపురం :** ఆనందపురం మండలం సొంత్యాం గ్రామంలో అభయాంజనేయ గుడి దొంగతనం కేసుకు సంబంధించి ఒక వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ భీమిలి ఆదనపు మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీన అభయాంజనేయ గుడిలో దొంగతనం జరిగినట్లు సొంత్యాం గ్రామానికి చెందిన బొద్దపు సంతోష్ ఫిర్యాదు చేశారు. ఆనందపురం క్రైమ్ పిఎస్‌లో కేసు నమోదు చేశారు. ఆనందపురం క్రైమ్ ఎస్ఐ మన్మధరావు విచారణ జరిపి కంచరపాలెం మెట్టకు చెందిన వడ్డే మూష్ (21)ను నిందితునిగా గుర్తించారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో విచారణ ముగిశాక నిందితునికి 6 నెలలు జైలు శిక్ష రూ.1000 జరిమానా విధిస్తూ జడ్జి విజయలక్ష్మి బుధవారం తీర్పునిచ్చారు.

### భారీ అన్నదానం

**ప్రజాశక్తి -తగరపువలస :** భీమిలి మండలం సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేట (డొకరపేట)లో బుధవారం భారీ అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వద్ద 41 రోజుల పాటు జరగనున్న ఈ అన్నదాన కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకట నారాయణ, గాడు అప్పలనాయుడు, సన్యాసినాయుడు, ఎస్.సత్యనారాయణ, బోని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - ఆరిలోవ :** జివిఎంసి 12వ వార్డు కొండవాలు ప్రాంతమైన క్రాంతినగర్ మెట్లు మార్గంలో ఐరన్ రైలింగ్ ఏర్పాటు పనులకు వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యాన మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, అల్లంపల్లి రాజబాబు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

### ఆనందపురం నుంచి ఆర్‌కె.బీచ్‌కు బస్సులు

**ప్రజాశక్తి -ఆనందపురం :** ఆనందపురం నుంచి రామకృష్ణ బీచ్ వరకు ఆర్‌టిసి నూతన సర్వీసులను ప్రారంభించింది. రోజువారీ ఆరు బస్సులు 12 ట్రిప్పులు తిరుగుతాయని మధురవాడ డిపో మేనేజర్ తెలిపారు. రానున్న కార్తీకమాసాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్‌క్.బీచ్‌కు యాత్రికులను ఆకర్షించే క్రమంలో బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 25 ఎం బస్సును 25 ఎగా మార్పు చేసి ఈ సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు.

### బండారు, తమ్మిరెడ్డి భేటీ

**ప్రజాశక్తి-పెందుర్తి:** తెలుగుదేశం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పెందుర్తి నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడానికి ఉమ్మడి కార్యచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జనసేన నాయకులు సేనాపతి సోమశేఖర్ పాల్గొన్నారు.

# దీపావళిని సురక్షితంగా చేసుకోవాలి

## డాక్టర్ ముగుందన్ రాజరాజన్

**ప్రజాశక్తి - ఆరిలోవ :** వెలుగులు చిమ్మే దీపావళిని సురక్షితంగా జరుపుకోవడం ముఖ్యమని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ముగుందన్ రాజరాజన్ చెప్పారు. దీపావళి పండగ సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలిచ్చారు. పిల్లలకు అందనీయకుండా టపాకాయలను అట్టపెట్టెలో పెట్టి, గ్యాస్ సిలిండర్లు, నూనె డబ్బాలు వంటి వాటికి దూరంగా ఉంచాలని తెలిపారు. టపాకాయలను బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలన్నారు. బాణ సంచా కాల్చేటప్పుడు సమీపంలో బకెట్లతో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. పొరపాటున కాలితే ఆ వ్యక్తికి దప్పటి చుట్టి సమీప ఆసుపత్రికి వెంటనే తరలించాలన్నారు. టపాసులు కాల్చేటప్పుడు పటిష్టమైన కళ్ళజోడు ధరించడం మంచిదని తెలిపారు. చేతితో పట్టుకొని, సీసాలలో, డబ్బాలలో, తిరగవేసిన కుండల్లో పెట్టి టపాకాయలను వెలిగించకూడదని చెప్పారు. ఈ మార్గదర్శకాలు పాటించడం ద్వారా ఆనంద దీపావళిని జరుపుకోవాలని సూచించారు.

# 'విజనరీ నాయకుడు చంద్రబాబు'

మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

**ప్రజాశక్తి -పిఎం పాలెం :** విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని, ఆయనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో తెలుగు యువత ఉపాధ్యక్షులు. కెవిఆర్ కేటరింగ్ అధినేత గరే గురునాథ్ ఆధ్వర్యాన 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. అనంతరం రాజబాబు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా పోయిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనంద్‌బాబు, గొలగాని సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, వార్డు బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, పోతిన రఘు, మహిళా అధ్యక్షులు బబ్బెలు, తాడేల లక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# బడ్డీల తొలగింపు

జెసిబితో తొలగిస్తున్న బడ్డీలు

**ప్రజాశక్తి -పిఎం పాలెం :** జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం చివరి బస్ స్టాప్ సౌండ్ అండ్ సౌండ్ లే-అవుట్ సమీపంలో ఉన్న బడ్డీలను టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం తొలగించారు. ఆ ప్రాంతంలో రోజు రోజుకూ అనధికార బడ్డీలు పెరిగిపోతుండటంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు ఉన్న తాత్కాలిక షాపులను శాశ్వత కట్టడాలుగా మార్చేస్తుండటంతో తొలగింపు చర్యలు చేపట్టామని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తెలిపారు. కొత్తగా మరికొంత మంది వచ్చి రోడ్డుకిరువైపులా ఖాళీ స్థలాలను ఆక్రమిస్తున్నందున ట్రాఫిక్ సమస్య జటిలం అయ్యే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఉన్న బడ్డీలను తొలగించినట్లు పేర్కొన్నారు. ఇకపై ఎవరైనా అక్రమంగా బడ్డీలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
అగనంపూడి, కూర్మన్నపాలెం, పూర్ణామార్కెట్, వన్‌టౌన్, అల్లిపురం, సాగర్‌నగర్, డాబాగార్డెన్స్, మద్దిలపాలెం, సిరిపురం, ఎ.యు., క్రైం రిపోర్టర్, జిల్లా పరిషత్, రాంపురం, ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి రూరల్
ఇంటర్వ్యూ : తేది 14-11-2023 మంగళవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 94900 99125, 94915 70765
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రీయల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

# విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెరగాలి

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెరగాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యాన 31వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ - 2023 జిల్లా స్థాయి పోటీలను గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 273 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా ఈ పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు, అభిరుచులు కలుగుతాయన్నారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు మంచి వేదికలన్నారు.

డిఇఒ ఎల్.చంద్రకళ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. సైన్సులో వస్తున్న మార్పులను, నూతన ఆవిష్కరణలను గమనిస్తూ తదనుగుణంగా విద్యార్థులు తమనుతాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సర్వశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు మంచి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ పి.రాజారావు మాట్లాడుతూ, వచ్చిన ప్రాజెక్టులలో అత్యుత్తమైన ఏడింటిని ఎంపిక చేసామని, వాటిని ఈ నెల 29, 30 తేదీలలో విజయవాడలోని కెఎల్.యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జి.సునీత, డిసిఎంఎస్ మాజీ చైర్ పర్సన్ పి.చినతల్లి, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

జాబ్ మేళాలో పాల్గొన్న ప్రతినిధులు

## 'ఆదర్శ్' జాబ్ మేళాలో 93 మంది ఎంపిక

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 93 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఇ.ఫ్లోరా తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రైసైజ్ గ్లోబల్ టెక్నాలజీ, ఎస్ట్రోటెక్ స్కిల్స్, బిఎస్ఎ, వెస్ట్‌సైడ్, డైకిన్ సంస్థలు పాల్గొన్నారు. ఆయా కంపెనీల హెచ్ఆర్‌లు విద్యాసాగర్ వర్మ, అనూష, రాజేశ్వరి, సంతోషి, సత్యతేజ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వెస్ట్‌సైడ్‌కు 30 మంది, ఎస్ట్రోటెక్ స్కిల్స్‌కు 20 మంది, ఐసిఐసిఐ బ్యాంక్‌కు 16 మంది, బిఎస్ఎకు 15 మంది, డైకిన్‌కు 11 మంది, ప్రైసైజ్ గ్లోబల్‌కు ఒకరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్ మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాకు అపూర్వ ఆదరణ వచ్చిందన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని యువత ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఒ రవిబాబు, వైస్ ప్రిన్సిపల్ ఎడికె.రాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ సిబ్బంది డి.సింహాచలం, పిజి.పద్మ, పాతిమున్నిసా బేగం గౌతమ్, వినయ్, మురళీకృష్ణ, రాజేష్, కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు తదితరులు

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి ధర్మానగర్‌లో రూ.64.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కెవిఎన్.శశికళ ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, స్థానిక ప్రజలు తీసుకొచ్చిన సమస్యలపై దృష్టి సారించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ భరణి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు అధ్యక్షులు కెపి.రత్నాకర్, దువ్వలపూడి శ్రీనివాసరావు, 55వ వార్డు నాయకులు యడ్ల సింహాద్రిరాజు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, వైవిఎన్.రాజు, బద్రి, సొండి సురేష్, చిన్న, అప్పారావు, కనకరాజు, లక్ష్మి, కరుణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టాళ్లను తిలకిస్తున్న చైర్మన్ బలరామకృష్ణ

## యువత విజ్ఞానాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : యువత విజ్ఞానాన్ని పెంచుకోవాలని టిఎస్ఆర్ అండ్ టిబికె కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ సూచించారు. టిఎస్ఆర్ కళాశాలలో బుధవారం విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విజ్ఞానంతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. కళాశాలలో విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇలాంటి సదస్సులు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌రావు, వైస్ ప్రిన్సిపల్ సుభాషిని పాల్గొన్నారు.

# ప్రజా రక్షణ భేరి సభకు తరలిరండి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -మధురవాడ : విజయవాడలో ఈ నెల 15వ తేదీన చేపట్టే ప్రజారక్షణభేరి బహిరంగ సభకు ప్రజానీకం పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు కోరారు. ఈ మేరకు బుధవారం మధురవాడ సిఐటియు కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి.అప్పలరాజు మాట్లాడుతూ, దేశంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏ తరగతి ప్రజానీకానికి రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం తదితరాలన్నీ ప్రయివేటు పరం అవుతున్నాయన్నారు. విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు.

రాష్ట్రంలో ప్రజా సమస్యలను ఎజెండాగా తీసుకురావడానికి సిపిఎం ఆధ్వర్యాన 'ప్రజా రక్షణ భేరి' పేరుతో మూడు బస్సు యాత్రలు జరుగుతున్నాయన్నారు. వీటి ముగింపుగా ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభకు మధురవాడ నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.రాజ్‌కుమార్, కె.సుజాత, కె.పుష్ప, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 16న ఇపిఎస్-96 పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 16వ తేదీన పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.దీనబంధు తెలిపారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో ఇపిఎస్-95 పెన్షనర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీనబంధు మాట్లాడుతూ, మినిమం పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, రైస్ కార్డు ఇవ్వాలని తదితర సమస్యలపై 16వ తేదీన టౌన్‌లోని పిఎఫ్ ఆఫీసు వద్ద చేపట్టే ధర్నాలో ఇపిఎస్ -95 పెన్షన్ దారులందరూ పాల్గొని విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ట గురునాథ్, ఎన్‌వి.రమణ, పాల వెంకయ్య, వెంకట్రావు, కణితి అప్పలరాజు పాల్గొన్నారు.

## విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : హైదరాబాదులో ఈ నెల 11న జరిగే మందకృష్ణ మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ విశాఖ జిల్లా అధ్యక్షులు సంపూర్ణం మాదిగ కోరారు. ఈ మేరకు ఉక్కు నగరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణం మాదిగ మాట్లాడుతూ, ఈ సభకు మాదిగ ఉపకులాలు, మాదిగ విద్యార్థులు, మాదిగ సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు పెద్దాడ సోమినాయుడు, అనపర్తి రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 50వ వార్డులో గడపగడపకు...

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధార, మాన్యం వీధి ప్రాంతాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.లక్ష్మి, కృష్ణారావు మాస్టర్, పప్పల సునీత, పైడి శ్రీను, అమర్ రెడ్డి, రామ్మోహన్, ఎవిఎన్.రాజు, సబ్బవరపు శ్రీను, రాజేశ్వరరావు, పొన్నాడ అప్పారావుమాస్టర్, నారాయణరావు, నారాయణస్వామి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 'ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే'

ప్రజాశక్తి -యంత్రాంగం

**భీమునిపట్నం** : 'ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని మండలంలోని అమనాం గ్రామ సచివాలయం వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ప్రారంభిస్తారని ఇంఛార్జి ఎండిఒ ఎ.లవరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న అన్నవరం, 14న చిప్పాడ, 15న దాకమర్రి, 16న లక్ష్మీపురం, 17న మజ్జిపేట, 20న మజ్జివలస, 21న మూలకుద్దు, 22న పెద నాగమయ్యపాలెం, 23న సింగన బంద సచివాలయాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

**మధురవాడ** : వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం ప్రారంభమవుతుందని వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు తెలిపారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కెకె.రాజు, నాయకులు మొల్లి అప్పారావు, పేర్ల విజయ్‌చందర్, రవి రెడ్డి, పి.సుజాత, మాధవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

**పద్మనాభం** : ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంపై పద్మనాభం మండల కాంప్లెక్స్‌లో బుధవారం మండల స్థాయి అధికారులతో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ సమావేశమయ్యారు.

## నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు : ఎసిపి మూర్తి

ప్రజాశక్తి - ఆరిలోవ : నిర్లక్ష్యం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని ద్వారకా ట్రాఫిక్ ఎసిపి ఆర్‌విఎస్ఎన్.మూర్తి పేర్కొన్నారు. 'రోడ్డు ప్రమాదాలు- నివారణ చర్యలు' అంశంపై అవగాహన సదస్సును బుధవారం విమ్స్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం మంచిదన్నారు. ద్వారకా ట్రాఫిక్ సిఐ కెవిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ, మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆరిలోవ సిఐ సోమశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ అధికారులు కరీం, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రవికుమార్, ట్రాఫిక్ ఎస్ఐ కుమార్, స్థానిక సంఘాల నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# పిఏసిఎస్‌లో చోరీకి విఫలయత్నం

## వాచ్‌మెన్‌ను తాళ్లుతో కట్టేసి, రూమ్‌లో బంధించిన దుండగులు

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట మండలం నరిశింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) బ్యాంకులో మంగళవారం రాత్రి చోరీ ప్రయత్నం జరిగింది. దుండగులు బ్యాంకు వాచ్‌మెన్ కృష్ణను తాళ్లతో కట్టేసి, రూమ్‌లో బంధించిన చోరీకి విఫలయత్నం చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నరిశింగబిల్లి పిఏసిఎస్ ఉద్యోగులు ప్రతి రోజూ లాగా మంగళవారం సాయంత్రం బ్యాంకు మూసి వేసి ఇంటికి వెళ్లిపోయారు. వాచ్‌మెన్ కృష్ణ రాత్రి డ్యూటీలో ఉన్నారు. బ్యాంకు చోరీకి వచ్చిన దుండగులు వాచ్‌మెన్ కృష్ణను విద్యుత్ వైర్లతో కాళ్లు, చేతులు కట్టేసి, రూమ్‌లో భంధించారు. ముగ్గురు దుండగులు బ్యాంకులో బంగారు ఆభరణాలు, నగదును అపహరించడానికి సిమెంట్ గోడ పగలగొట్టి, స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళ్ళేందుకు ప్రయత్నం చేశారు. లాకర్‌లు తెరిచేందుకు ప్రయత్నం చేసినా అవి రాకపోవడంతో దుండగులు వెనుదిరిగారు. బుధవారం ఉదయం బ్యాంకు లోపల నుండి వాచ్‌మెన్ చేస్తున్న శబ్దం విని స్థానికులు వచ్చి వాచ్‌మెన్‌కు తాళ్ళ విప్పారు. వెంటనే పిఏసిఎస్ కార్యదర్శి ఎన్.అచ్చియ్య నాయుడుకు సమాచారం ఇవ్వగా, ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, అనకాపల్లి డిఎస్‌పి సుబ్బరాజు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఇక్కడ జరిగిన విషయంపై సిబ్బంది, కార్యదర్శి, వాచ్‌మెన్ కృష్ణను విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్ల్యూస్ టీం సిబ్బంది అక్కడున్న వేలుముద్రలు సేకరించారు. సిసి పుటేజీలను పరిశీలించారు. కశింకోట ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళ్లతో బంధిగా ఉన్న వాచ్‌మెన్ కృష్ణ

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థులు

## బాలల సైన్స్ కాంగ్రెస్‌లో కాశీపురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : జోనల్ స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలలో కాశీపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం చోడవరంలో జరిగిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన పోటీలలో కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన నాచుతో నాణ్యమైన పెట్రోల్ తయారీ ప్రాజెక్టు ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పిబిటి సుందరి తెలిపారు. ఈ ప్రాజెక్టు వలన రోజు రోజుకి కొరత ఏర్పడుతున్న శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా ఈ నాచుతో నాణ్యమైన పెట్రోల్ తయారీ ప్రాజెక్టును బయాలజీ ఉపాధ్యాయురాలు బుర్ర పూర్ణిమ పర్యవేక్షణలో విద్యార్థులు అనన్య, అఖిల్ తయారు చేసినట్లు చెప్పారు. వీరిని ఎంఈఓ -1 పడాల దాసు, ఎంఈఓ -2 ఉషారాణి, ప్రధానోపాధ్యాయిని పిబిటి.సుందరి, కొటాన రాంబాబు మాస్టారు, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు 9వ తేదీ గురువారం కశింకోటలో జరిగే జిల్లా స్థాయి వైజ్ఞానిక పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు.

## మానసిక సమస్యలతో పలు రుగ్మతలు

ప్రజాశక్తి-సబ్బవరం : సకల సమస్యలకు మూల కారణం మానసిక సమస్య అని సైకాలజిస్ట్ సాయిలక్ష్మి అన్నారు. అనకాపల్లి మానసిక వైద్య ఆరోగ్యశాఖ, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా 'మేమున్నాం ఏ సమస్యకైనా పరిష్కారం ఉంది' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ సాయిలక్ష్మి మాట్లాడుతూ నేటి విద్యార్థుల మానసిక రుగ్మతలకు గల కారణాలు, సమస్యలను పరిష్కరించే మార్గాలను తెలిపారు. ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ సామాజిక, ఇతర మాధ్యమాల ద్వారా ఒత్తిడి పెరగడంతో నేటి యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. సోషల్ వర్కర్ మధులత మాట్లాడుతూ కుటుంబ సంబంధాలు, స్నేహితులు, బంధువుల మధ్య సామాజిక సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయని చెప్పారు. ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ గణేష్, బోటని అధ్యాపకులు నివేదిత, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్తలు

# 'జగనన్నకు చెబుదాం'లో అర్జీల వెల్లువ

మునగపాక మండల సమస్యలు వివరిస్తున్న రైతు నేత ఆళ్ల మహేశ్వరరావు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

స్థానిక రాహుల్ గాంధీ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. వివిధ సమస్యలపై 178 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఇతర అధికారులు స్వీకరించారు. తిరస్కరణకు గురైన వాటికి సమాధానంలో కారణాలను వివరంగా తెలియజేయాలన్నారు. 178 దరఖాస్తుల్లో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం (స్పందన)కు వచ్చే అర్జీలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, ఆర్డీఓ ఎ.చిన్నికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**మండల సమస్యలపై రైతు సంఘం, సిఐటియు నేతల వినతి**

మండలంలోని సమస్యలపై కౌలు రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు పెంటకోట సత్యనారాయణ తదితరులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టికి వినతి పత్రం అందజేశారు. ప్రమాదాలకు నిలయంగా మారిన అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. అనకాపల్లి వయా పరవాడ తంతడి రోడ్డు విస్తరించి నిర్మాణ పనులు జరపాలని, గవర్ల అనకాపల్లిలో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మునగపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పక్క భవనాలు నిర్మించాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని కలెక్టర్‌ను కోరారు.

# అయ్యప్ప స్వాముల భిక్షకు రూ.1.10 లక్షల విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మాలలు వేసిన స్వాములకు భిక్ష నిమిత్తం ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) లక్షా 10 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. బుధవారం అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వాములకు ఏర్పాటు చేసిన భిక్షలు (అన్న సమారాధన) కార్యక్రమానికి ఎంవిఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ మాట్లాడుతూ గతేడాది అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారి పడి మెట్లు నిమిత్తం రూ.3,98,000 అందించినట్లు చెప్పారు. అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన భక్తులు కఠినమైన నియమాలను పాటిస్తూ 41 రోజుల మండల దీక్ష చేస్తే ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంవిఆర్ తనయుడు ముత్యాల సతీష్ బాబు (సంజూబాబు), అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు, ఎంవిఆర్ ట్రస్ట్ సభ్యులు, సంజూబాబు యువసేన పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

# వైసిపిలో చేరిన టిడిపి నాయకుడు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి శివారు అచ్చయ్యపాలెం గ్రామానికి టిడిపి నాయకుడు పెద్దాడ రాము ఆ గ్రామ సర్పంచ్ చింతలవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో ఆయన సీఎం క్యాంప్ కార్యాలయంలో వైసిపిలో చేరారు. రాముకు కండువా వేసి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి కర్రి సత్యం, మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూర్యనాయుడు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు అందజేస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -అనకాపల్లి : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి తెలిపారు. ఎన్టిపిసి, ఫారెస్ట్ రేంజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ క్యాంప్ కార్యాలయం వద్ద మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి సత్యవతి మాట్లాడుతూ నేడు పెరుగుతున్న కాలుష్య రీత్యా మానవాళి జీవనశైలి ప్రమాదంలో ఉందని, ఆరోగ్యం కాపాడేందుకు ప్రతి ఇంటిలో ఒక మొక్క నాటాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి సిఎస్ఆర్ హెచ్ఆర్ ప్రకాష్‌రావు, గైపూరి రాజు, వైసిపి రాష్ట్ర ఆరోగ్య వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనారాయణ, ఫారెస్ట్ శాఖ అధికారులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ పనులు 60 శాతం పూర్తి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రత్యేక శ్రద్ధతో మాడుగుల నియోజకవర్గంలో 2022-23 సంవత్సరంలో జల్ జీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి రూ.97.40 కోట్లతో నాలుగు మండలాల్లో జరుగుతున్న 248 పనులలో 60 శాతం పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ మాడుగుల సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అల్లు సూర్యనారాయణ చెప్పారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాడుగుల మండలంలో రూ.32.87కోట్లతో 69 పనులు, చీడికాడలో రూ.19.76 కోట్లతో 47 పనులు, దేవరాపల్లిలో రూ.29.28 కోట్లతో 82 పనులు, కె.కోటపాడు మండలంలో రూ.15.48 కోట్లతో 50 పనులు జరుగుతున్నాయని చెప్పారు. నీటి పథకాలు, బోరు బావులు నిర్మాణం, పంపింగ్, పంప్ హౌస్, విద్యుత్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ నిర్మాణాలు ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులకు సంబంధించి మిగిలిన 40 శాతం పనులు ప్రగతి దశలో ఉన్నాయని డీఈఈ వివరించారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు దృష్టికి వచ్చిన పలు తాగునీటి సమస్యల పరిష్కారం నిమిత్తం నూతనంగా మంజూరు చేసిన రూ.36 కోట్లతో నాలుగు మండలాల్లో 115 పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. ఆయన వెంట సైట్ ఇంజనీర్ గండి లక్ష్మణరావు ఉన్నారు.

## సిసి కెమెరాల వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం పోలీసు స్టేషన్‌కు 21 సిసి కెమెరాలను ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ సమకూర్చింది. ఈ మేరకు ఈ సిసి కెమెరాలను బుధవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై మురళీరావు చేతుల మీదుగా స్టేషన్‌లో ప్రారంభించారు. ఏషియన్ పెయింట్స్ అందజేసిన సీసీ కెమెరాలను అచ్యుతాపురం జంక్షన్ తదితర ప్రదేశాల్లో అమర్చారు. సీసీ కెమెరాల వల్ల ప్రమాదాలు, దొంగతనాలు, లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు ఉపయోగపడతాయని సిఐ తెలిపారు. సీసీ కెమెరాలు చిత్రీకరించిన వీడియోల ద్వారా పత్కు నేరాలను వెంటనే గుర్తించి సత్వరం న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఏషియన్ పెయింట్స్‌ను ఆదర్శంగా తీసుకొని మరిన్ని సీసీ కెమెరాలు ఇవ్వటానికి ముందుకు రావాలని కోరారు. సీసీ కెమెరాలు సమకూర్చిన ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ హెడ్ బి.జగన్నాథ్, పరిశ్రమ హెచ్ఆర్ టీవీ శ్రీజిత్, ఎస్సై సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్న సిఐ

## సంక్షేమ పథకాలు అందిపుచ్చుకోవాలి

**ప్రజాశక్తి - పరవాడ :** వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని వెన్నలపాలెం పంచాయతీలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా వెన్నలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు కోన రామారావు, వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వెన్నలపాలెం ఎంపీటీసీ వెన్నెల అరుణ కుమారి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పల్లా అప్పారావు నాగమణి, బండారు కల్పన రాజశేఖర్, కె.వరలక్ష్మి సీతారామయ్య, జి.గోపి అమ్మలు, కలపాక ఎంపీటీసీ సప్పప్రభ సన్యాసిరావు, పాల్గొన్నారు.

## ఉత్సవ కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** మండలంలోని హరిపాలెం గ్రామంలో గౌరీ పరమేశ్వర్లు, ఇతర పండగల ఉత్సవ కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. గ్రామ రామాలయంలో బుధవారం ఉదయం జరిగిన సమావేశంలో నూతన కమిటీని గ్రామస్తులు ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా మారిశెట్టి అప్పలనాయుడు, కార్యదర్శిగా కశిరెడ్డి పరదేశినాయుడు, క్యాషియర్‌గా కాండ్రేగుల వెంకటి, మెంబర్స్‌గా కాండ్రేగుల వీరు నాయుడు, బండారి సత్తిబాబు, మల్ల ప్రకాష్, కాండ్రేగులు పారునాయడు, మారిశెట్టి అనంత, పి సత్తిబాబు ఎన్నికయ్యారు.

## జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం అనకాపల్లి రింగ్ రోడ్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనకాపల్లి జర్నలిస్టుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలోవైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, జర్నలిస్టు నాయకులు పెంటకోట జోగినాయుడు, మల్ల భాస్కరరావు, కోయిలాడ చంద్రశేఖర్, సర్వారావు, మార్టూరు అజయ్, పాల్గొన్నారు.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు పట్ల హర్షం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం రాష్ట్ర పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి ప్రెస్‌క్లబ్, ఏపీడబ్ల్యుజేఎఫ్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తీర్థయాత్రకు బయలుదేరిన మహిళలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన పలువురు మహిళలు బుధవారం ముత్యాల గ్రూపు ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఏర్పాటు చేసిన బస్సులో తీర్థయాత్రకు బయలుదేరారు. స్థానిక నరసింగరావుపేటలోని తన కార్యాలయం వద్ద ఎంవిఆర్ బుధవారం ఆ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రాలు సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఎంవిఆర్ యువసేన సభ్యులు, సంజూ బాబు టీం పాల్గొన్నారు.

## 'భవిష్యత్‌కు గ్యారెంటీ'పై ప్రచారం

**ప్రజాశక్తి- అనకాపల్లి :** మండలంలోని కోడూరు శివారు భూపతిపాలెం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి మంత్రులు చేపడుతున్నది సాధికార బస్సు యాత్ర కాదని, ఎస్సీ, ఎస్టీ, బీసీలపై చేస్తున్న దండయాత్ర అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, తలారి కాశీ నాయుడు, పచ్చికూర రాము, దాడి పెంటారావు, రాకోటి చిన అప్పారావు, కరణం రమణ, గంగిరెడ్ల గోవిందా, పోలారపు త్రినాధ్ పాల్గొన్నారు.

**రాంబిల్లి :** టిడిపి మండల అధ్యక్షులు దినుబాబు ఆధ్వర్యాన బాబు షూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ అనే కార్యక్రమం రాంబిల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా దినుబాబు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించే ప్రతి పథకం వెనుక, ఇచ్చే ప్రతి హామీ వెనుక విస్తృత అధ్యయనం, చర్చ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ద్వారపురెడ్డి నానాజీ, అందుకూరి ప్రసాద్, ప్రకాష్, పాల్గొన్నారు

## అన్న సమారాధన

**ప్రజాశక్తి- కె.కోటపాడు :** మండలంలోని గొండుపాలెం గ్రామంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా బుధవారం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళల చిడతలు, తప్పుడు గుళ్ళచ భజనలు, కోలాటాలు నడుమ మందుగుండుతో గౌరీ పరమేశ్వరుల అనుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# 'కరువు జిల్లాగా ప్రకటించే దమ్ముందా?'

**ప్రజాశక్తి- అనకాపల్లి**

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అనకాపల్లి జిల్లాలో పంటలు తీవ్రంగా నష్టపోయి రైతులు కష్టాల్లో ఉన్నారని, ఈ నేపథ్యంలో వైసిపి బస్సు యాత్రలో అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించే దమ్ము వైసిపి నాయకులకు ఉందా? అని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ప్రశ్నించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు ఉత్తరాంధ్రని గాలికి వదిలేసి ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఏమి మేలు చేశారని, ఏం ముఖం పెట్టుకొని సామాజిక సాధికార బస్సు యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములను తమ స్వప్రయోజనాల కోసం బ్యాంకులకు తాకట్టు పెట్టేసారని, గంగవరం పోర్టును అతి చౌకగా 646 కోట్లకు ఆదానికి ధారాదత్తం చేసి కంపెనీలో షేర్లు రూపంలో కమీషన్ రూపంలో దోచుకుతిన్నారని విమర్శించారు. 1000 రోజులుగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతుందని, ప్రైవేటీకరణను వ్యతిరేకించకుండా బస్సు యాత్ర ఏ ముఖం పెట్టుకొని చేస్తారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాలువ, సుజల స్రవంతి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు గూనూరు మల్లు నాయుడు, మాదంశెట్టి శెట్టి నీలబాబు పాల్గొన్నారు.

## 'ఎపికి జగన్ ఎందుకు కావాలో బస్సు యాత్రలో వివరిస్తాం'

**ప్రజాశక్తి-అనకాపల్లి**

అనకాపల్లిలో జరుగు సామాజిక సాధికార బస్సుయాత్ర ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలో వివరిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక రింగ్ రోడ్డు వైసిపి క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. నాలుగు లక్షల 93 వేల ఉద్యోగాలు కల్పించామని, వ్యవసాయంలో 8.2 శాతం వద్ధిరేటు సాధించి ఆరో స్థానంలో ఉన్నామని చెప్పారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ పదివేలకు పైబడి వైయస్సార్ క్లినిక్‌లు నిర్మించినట్లు చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సారధ్యంలో 30 వేల మందితో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, కొణతాల మురళి కష్ణ, జాజుల రమేష్, పెద్ది శెట్టి గోవింద, గొల్లవిల్లి శ్రీనివాసరావు, బొడ్డేడ శివ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

## నల్ల దుస్తులతో జనసేన నిరసన

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో నల్ల దుస్తులతో, గో బ్యాక్ మినిస్టర్స్ అంటూ ప్లేకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం అనకాపల్లి నియోజకవర్గం లో వైసీపీ ఏర్పాటు చేస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏ ముఖం పెట్టుకుని ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా తీవ్ర వర్షభావం వల్ల వేల ఎకరాలలో పంట దెబ్బతిందని, అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పంట కాలువలు, గ్రోయిన్లు పూర్తిగా దెబ్బతిని మరమ్మత్తులు చేపట్టాలన్నారు. సామాజిక సాధికార యాత్ర సభ నిర్వహించాలంటే అనకాపల్లిని కరువు జిల్లాగా చేర్చి రైతులకు నష్టపరిహారం ప్రకటించి మాత్రమే చేయాలని, లేకుంటే బస్సు యాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శ్రీరాందాస్ గోవింద్, దూలం గోపి, మళ్ల శ్రీను, అప్పికొండ గణేష్, గంగుపాం జగదీశ్, వరహాలు రాజు,విరమహిళ సీత గారు,ప్రసాద్, గణేష్, లక్ష్మణ్, టిడిపి నాయకులు పోలవరపు త్రినాథ్, కొణతాల రత్నకుమారి, సునీల్, పవన్ పాల్గొన్నారు.

# గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి- కె.కోటపాడు**

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయ అధికారి ఎం.పద్మావతి కోరారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఈర్లే అప్పారావును బుధవారం గ్రంథాలయ అధికారి పద్మావతి కలిసి గ్రంథాలయాల వారోత్సవాలు దిగ్విజయంగా నిర్వహించడానికి తమ విద్యార్థులతో కలిపి సహకరించాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ సమయంలో విద్యార్థులచే గ్రంథాలయం వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

**సబ్బవరం :** స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి.శిరీష తెలిపారు. ఈ వారోత్సవాలు వారం రోజులు పాటు విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, డిబేట్, రంగోలి, క్విజ్, క్రీడా పోటీలు, వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వారోత్సవాలకు వివిధ పాఠశాలల విద్యార్థులు, పాఠకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు 20వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

**గొలుగొండ :** ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గొలుగొండ శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎన్.రాజుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 14న నెహ్రూ జయంతి, వ్యాసరచన, 15న మ్యూజికల్ చైర్, క్విజ్, 16న చిత్రలేఖనం, 17న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ సేకరణ, వ్యాసరచన, 18న మత్తు పదార్థాలు యువతపై ప్రభావంపై డిబెట్, కవిసమ్మేళనం, 19న మహిళాదినోత్సవం, 20న మాస్ రీడింగ్, ముగింపు సభ ఉంటుందని, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ :** మున్సిపాలిటీ బలి ఘట్టంనకు చెందిన తమరాన చినబాబు కుమారుడు తమరాన రవితేజ 2017లో బలిఘట్టం గ్రామంలో ఉత్తర వాహిని నదిలో పుణ్య స్థానానికి వెళుతూ బైక్ ప్రమాదంలో చనిపోయాడు. బాధిత కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు వివరించడంతో సీఎం సహాయనిధి కింద రూ.2లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు ఈ చెక్కును బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ పాల్గొన్నారు.

## రోగులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి -యస్.రాయవరం :** మండలంలో కొరుప్రోలు గ్రామంలోని ఫ్యామిలీ పిజిషన్ కాన్సెప్ట్‌లో భాగంగా మెడికల్ క్యాంపును హెల్త్ వెల్నెస్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ, రోగులకు 14 రకాల పరీక్షలు నిర్వహించి 67 రకాల మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. అవసరం అయితే అనకాపల్లి ఎన్టీఆర్, కేజీహెచ్‌కు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్, ఎంఎల్‌హెచ్‌పి ప్రశాంతి, ఏఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

## 9న బహిరంగ సభ

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :** బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 9న నర్సీపట్నం సిటీ క్లబ్ ఆవరణంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రచార రథాన్ని పార్టీ సీనియర్ నాయకులు చిటికెల అప్పలనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్టా నాగరాజు మాట్లాడుతూ, రాజ్యాధికారం కోసం బహుజ నులంతా ఏకమై ఈనెల 9న జరిగే బహిరంగ సభకు కదలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ కన్వీనర్ కొల్లు గంగాధర్, బివిఎఫ్ జిల్లా కన్వీనర్ ఆనంద్, పార్టీ నియోజకవర్గ ప్రెసిడెంట్ కిల్లాడ సూరిబాబు, గొలుగొండ మండల నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ట్యాబ్‌ల పంపిణీ

**ప్రజాశక్తి-కశింకోట :** మండలంలోని వికలాంగ విద్యార్థులు, ఉఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు తాళ్ళపాలెం వికలాంగ ఉపాధ్యాయులు కోమాకులు వెంకటేశ్వరరావు తెలిపారు తనతో పాటు కశింకోట ఐఇఆర్‌టిలు ఎస్ రవణమ్మ, దీప వికలాంగుల విద్యార్థి నాగలి దేవి, మౌనికకు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతులు మీదుగా అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

## పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

**ప్రజాశక్తి -కశింకోట :** మండలంలోని కశింకోట వెదురుపర్తి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ బుధవారం ప్రారంభించారు. కశింకోట కోమటివీధి, వడ్డీవీధి, మర్రిచెట్టు ఏరియాలో రూ.15 లక్షలతో నిర్మించిన డ్రైన్లు, కల్వర్టులను, రూ.15 లక్షలతో నిర్మించిన బిఆర్ అంబేద్కర్ ఎస్సీ రెల్లి కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్‌ను, వెదురుపర్తి గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లివిల్లి శ్రీనివాసరావు, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, వైసిపి నాయకులూామలసాల భరత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు

## ఎండిపోయిన పంటలు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :** సకాలంలో వర్షాలు కురవక సాగునీరు అవకాశం లేక పలు గ్రామాలలో వరి నాట్లు ఎండిపోయాయి. బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, నీలకంఠాపురం, తైపురం, ఆర్ శివరాంపురం, మల్లాం తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. వరి నాట్లకు నీరు లేక పొలాలన్నీ బీటల వారాయి. దీంతో రైతులు గత రెండు రోజులుగా ఎండిపోయిన వరి నాట్లను పశు గ్రాసంగా కోసి వేస్తున్నారు. మండలంలోని ఆర్ శివరాంపురం గ్రామంలో బుధవారం పలువురు రైతులు ఎండిపోయిన వరి నాట్లను కోసి పశుగ్రాసంగా వినియోగించారు. ఒక్కో ఎకరానికి రూ.20వేలు నుండి రూ.25 వేలు వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు.

## ఇంటర్ వర్సిటీ పోటీలకు డైట్ విద్యార్థిని ఎంపిక

**ప్రజాశక్తి-అనకాపల్లి :** స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సిఎస్ఈ ఆఖరి సంవత్సరం విద్యార్థిని కే.తేజ ఈ నెల 9 నుంచి 12 వరకు సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొంటారని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థిని అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో ఎంపిక కావడం పట్ల చైర్మన్ దాడి రత్నాకర్ , ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు డాక్టర్ కే.పార్వతి, కృష్ణనాగ్ హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శిస్తున్న బూడి ముత్యాలనాయుడు

## బాధితులకు బూడి పరామర్శ

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల సాధికార బస్సుయాత్ర ప్రమాద బాధితులను బుధవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పరామర్శించారు. మండలంలోని అవురువాడకు చెందిన కొప్పుల దేముడమ్మ, కిలంబోయిన రాజులమ్మా, బిడిజన లక్ష్మిలు మాడుగుల సామాజిక సాధికార యాత్ర అనంతరం తిరుగు ప్రయాణంలో గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వారిని పరామర్శించి పండ్లు అందజేసి ధైర్యం చెప్పారు. వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి డిప్యూటీ సూపరిం టెండెంట్, సంబంధిత వైద్యులకు సూచించారు.

మాట్లాడుతున్న రాజు

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని చోడవరం జనసేన ఇన్ ఛార్జ్ పివిఎస్ఎన్ రాజు డిమాండ్ చేసారు. బుధవారం రావికమతం మండలం కవ్వగుంట రెవెన్యూ పరిధిలో పంట నష్టపోయిన పలువురు రైతులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు తొమ్మిది గంటల పాటు నిరంత రాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. చక్కెర కర్మాగారం రైతులకు బకాయిలను చెల్లించకుండా బస్సు యాత్రలు చేస్తున్నారని దుయ్య బట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మైచర్ల నాయుడు, నాయకులు బలిజ మహారాజు, లొట్ల శివ, బంటు రామునాయుడు, యతిరాజ్యం భూషణం, పోలమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

## రూ. 10 వేల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -కొత్తకోట:కష్టాలలో ఉన్న కొంత మందికైనా సాయం చేయాలనే సంకల్పంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న స్నేహాంజలి ఫర్ పోర్ట్ అసోసియేషన్ సభ్యులు జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన జిడి పిక్కల ఫ్యాక్టరీ మహిళా కార్మికురాలు మార్తి దేవికి రూ. 10 వేల ఆర్థిక సాయన్ని బుధ వారం అందించారు. దేవి జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తూ దివ్యాంగుడైన తండ్రి, వృద్ధురాలైన తల్లిని పోషిస్తోంది. ఇటీవల ఆమె కు ఆరోగ్యం క్షీణించింది. దీంతో గత ఆరు నెలలుగా ఇంటికే పరిమితం అయ్యింది. కుటుంబం కష్టాలలో ఉండటంతో ఆ సంస్థ సభ్యులు బోగేష్, నల్లయ్య, ప్రకాష్, హరి తదితరులు బుధవారం ఆమె కు ఆర్థిక సహాయం అందించారు.

# జాతీయోద్యమ నేతలకు వినతులు

వినతిపత్రాలు సమర్పిస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో డ్రగ్స్ కంపెనీ చట్టాలను ఉల్లంఘించి, రాజ్యాంగ వ్యవస్థలను తప్పుదారి పట్టించి, పూర్తిస్థాయిలో అనుమతులు లేకుండా కొత్త పైపులైన్ ఏర్పాటు చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించి, నిరసన తెలిపారు. మత్స్యకారులను భయభ్రాంతులకు గురి చేసి వందలమంది పోలీసులను మోహరించి దౌర్జన్యంగా పైపులైను వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, పైపులైను పనులు ఆపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు ఎం.మహేష్‌బాబు, జి.సోమేశ్వరరావు, సిహెచ్. సోమేష్, బి.నూకరాజు, ఎం.శివాజీ, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు గుర్తించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామస్తుల అభిప్రాయంతో అభివృద్ధి పనులు గుర్తించాలని పందూరు సర్పంచ్ జగదీశ్ సూచించారు. బుధవారం గ్రామ సచివాలయంలో కార్యదర్శి జోష్న ఆధ్వర్యంలోఉపాధి గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో 70 లక్షలతో 23 పనులు గుర్తించారు. ఇంకా పనులు గుర్తించాల్సి ఉందన్నారు. జగంపేట గ్రామంలో కోటి రూపాయలతో 27 పనులు, ఆర్ సి పాలెం లో కోటి పది లక్షలతో 32 పనులను గుర్తించారు. ప్రధానంగా గ్రామస్తులకు ఉపాధి కల్పనలో ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ జగదీష్

# గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి : ధర్మశ్రీ

మాట్లాడతున్న ధర్మశ్రీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట:ప్రజా సమస్యల పరిష్కారం కోసం పల్లెనిద్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలో కోమలపూడి అమరపురి వద్ద వైసిపి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల దృష్టిలో పెట్టుకొని పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, జడ్పిటిసి దొండా రాంబాబు, దాకారపు నాగరాజు, కొల్లిమల్ల అచ్చం నాయుడు, విశాఖ డైరీ డైరెక్టర్ సత్యనారాయణ, కోరుకొండ అప్పలనాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి:ప్రాణం ఉన్నంత వరకు జగన్ తోనే తన ప్రయాణమని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. స్థానిక సుబ్బిరామరెడ్డి కళ్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబురావు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ, విభేదాల కారణంగా కొంతమంది నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కాలేదని వారిని కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు.మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, పార్టీ నాయకులు సురకాసుల గోవింద్, ఎలమంచిలి తాతబాబు, శేషారత్నం, చంద్రరావు, బాబురావు పాల్గొన్నారు .

## రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో ప్రతిభ

ప్రజాశక్తి -కొత్తకోట:మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలో 85 కేజీల సీనియర్ విభాగంలో రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన గసాడ మోసె రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో నిలిచి పలువురి అభినందనలు అందుకు న్నాడు. మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు ఇటీవల విశాఖలో మూడు రోజులుగా నిర్వహించారు. విశాఖ ఫిట్నెస్ బాడీ బిల్డర్ అసోసియేషన్, నవ్యాంధ్రప్రదేశ్ ఫిట్నెస్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి యువకులు హాజరు కాగా అనకాపల్లి జిల్లా నుంచి గసాడ మోసే ఈ పోటీలకు వెళ్లారు. మొదటి ప్రయత్నంలోనే 5వ స్థానం సాధించాడు.

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మోసె

## భారీ ఆదాయం

ప్రజాశక్తి కోటవురట్ల:మండల కేంద్రంలో నిర్వహించిన యూకలిప్టస్ వేలంపాటలో భారీ ఆదాయం సమకూరింది. సర్వే నెంబర్ 315 లో రెవెన్యూ కొండ భూమి 150 ఎకరాలలో 576 యూకలిప్టస్ చెట్లకు బుధవారం సచివాలయం వద్ద తహసిల్దార్ జానకమ్మ సమక్షంలో వేలంపాట నిర్వహించారు.పాటదారులు సుమారు 65 మంది హాజరు కాగా ఒక్కొక్కరు యాభై వేల చొప్పున ధరావత్తు చెల్లించారు. అనూహ్యంగా పాటదారులు పోటీ పడి 21.90 లక్షలకు సర్వసిద్ధి గణేష్ వేలం పాట పొందారు. . 15 రోజుల్లోగా పూర్తి సొమ్ము చెల్లించి కటింగ్ ఆర్డర్ పొందాలని నిర్వాహకులు తెలిపారు, కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి భానోజీరావు, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బీట్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేలంపాటకు హాజరైన అధికారులు, పాటదారులు

## 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -మాడుగుల:56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మాడుగుల గ్రంథాలయాధికారి వై. వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

15న ఉదయం పుస్తక ప్రదర్శన, నూతన ధరావత్తులు సేకరణ, సాయంత్రం నాలుగు గంటలకు డ్రగ్స్ పై అవగాహన, పుస్తకాలు చదువడంతో ప్రయోజనాలు, 16న ఉదయం గ్రంథాలయ రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖులు గూర్చి ప్రసంగం, సాయంత్రం నాలుగు గంటలకు నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు, 17న ఉదయం జాతీయ నాయకులపై చర్చ గోష్ఠి, సాయంత్రం 6 7 తరగతి విద్యార్థులకు రీడింగ్ పోటీలు, 18న ఉదయం గ్రంథాలయాలపై అవగాహన, సాయంత్రం నాలుగు గంటలకు ఎనిమిది తొమ్మిది తరగతి విద్యార్థులకు పాటలు పోటీలు(దేశభక్తి పాటలు). 19న ఉదయం మహిళా దినోత్సవం సందర్భంగా అభివందన సభ, ఇందిరాగాంధీ చిత్రపటం ఆవిష్కరణ, సాయంత్రం సంక్షేమ పథకాలు, దిశా చట్టంపై అవగాహన, 20న ఉదయం డిజిటల్ లైబ్రరీపై అవగాహన, సాయంత్రం విజేతలకు బహుమతి ప్రధానం చేస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

## చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మాడుగుల:జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను మండల కమిటీ మెంబర్స్, మండల విద్యాధికారులు పాండురంగారావు, దేవుడమ్మల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తాలపురెడ్డి నాగచంద్ర మాట్లాడుతూ, ఈనెల 10వ తేదీన మండలంలోని ప్రతి పాఠశాలలో చెకుముకి పాఠశాల స్థాయి పరీక్షను నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైతే మండల స్థాయి, జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కార్యదర్శి గౌరీ పట్టపు మహేష్, మాడుగుల మండల ఉపాధ్యక్షుడు జాగాని ఈశ్వరరావు, కోశాధికారి చిన్నం నాయుడు, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి మండల అధ్యక్షునిగా జోగా

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: బుచ్చయ్యపేట మండల వైసిపి అధ్యక్షునిగా జోగా కొండబాబును నియమించారు. మండలంలో పెదమదీనా గ్రామానికి కొండబాబు మండల స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ మేరకు మండలంలో

కోమళ్ళపూడి వద్ద బుధవారం జరిగిన వైసీపీ మండల స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మండల పార్టీ అధ్యక్షునిగా జోగా కొండబాబు పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన కొండబాబు మాట్లాడుతూ, మండలంలో పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## కొండపాలెంలో గ్రామసభ

ప్రజాశక్తి-రోలుగుంట: 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఏపిఒ సూర్యమణి తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం మండలంలో కొండపాలెం గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతీ గ్రామంలో లేబర్ బడ్జెట్‌కు సంబంధించి పనులను గుర్తించడం జరుగుతుందన్నారు. గ్రామాల వారీగా సీజనల్ మ్యాప్, రిసోర్స్, సోషల్ మ్యాప్‌తో పనులు గుర్తించడం జరుగుతుందన్నారు. 100 రోజుల పనిపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ..

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

## -మూతపడ్డ స్కూళ్లు, కాలేజీలు - పలుచోట్ల ర్యాలీలు, మానవహారాలు

నర్సీపట్నంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నేతలు

అనకాపల్లిలో...

ప్రజాశక్తి-యంత్రాంగం: **విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ, కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు అంశాలపై విద్యార్థి, యువజన సంఘాలు బుధవారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ అనకాపల్లి, విశాఖలో జయప్రదమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పలు చోట్ల విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీ, మానవహారాలు చేపట్టారు.**

**విశాఖ కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ, కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు అంశాలపై విద్యార్థి, యువజన సంఘాలు బుధవారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విశాఖలో జయప్రదమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కొన్ని తెరిచిన విద్యాసంస్థల వద్దకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ నాయకులు వెళ్లి అభ్యర్థించడంతో నిర్వాహకులు వాటిని కూడా మూసివేశారు. ఆంధ్రా యూనివర్సిటీ, కృష్ణా కాలేజీ, బుల్లయ్య కాలేజీ, ప్రభుత్వ మహిళా కళాశాల, బివికె కాలేజీ, గాయత్రి కాలేజీ, రామబాణం, జూబ్లీ కాలేజీలు, ప్రభుత్వ ఐటిఐ, కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల తదితర ప్రాంతాల్లో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.శివ, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన రాష్ట్ర స్థాయి విద్యా సంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు లభించిందన్నారు. శాంతియుతంగా బంద్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులను ఐదో పట్టణ పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు నేపథ్యాన్ని వివరించారు. విశాఖపట్నం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్‌ను కారు చౌకగా తమ అనుయాయులైన అదానీ, అంబానీలకు కట్టబెట్టడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఈ బంద్ సందర్భంగా విద్యార్థి, యువజనుల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మణికంఠ, డివైఎఫ్ఐ నాయకులు శ్రావణ్, షణ్ముఖ, కోటి, గణేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, నిఖిల్ నరేష్, వేణు, కౌశిక్, రవి, అఖిల్ పాల్గొన్నారు.

**భీమునిపట్నం :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, సొంత గనులు కేటాయించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల జెఎసి పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ భీమిలి జోన్ కమిటీల ఆధ్వర్యాన బుధవారం జరిగిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. పలు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు మూత పడ్డాయి. ఆయా పాఠశాలలు, కళాశాల విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలను నిరసించారు. ఎస్ఎఫ్ఐ భీమిలి జోన్ కన్వీనర్ కె.తేజశ్రీ, టి.ఝూన్సీలక్ష్మి, డివైఎఫ్ఐ జోన్ కన్వీనర్ జి.సూరిబాబు, ఎస్.శ్రీనివాసవర్మ, ప్రవీణ్, వాసు, హేమంత్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో స్కూల్ నుంచి వస్తున్న విద్యార్థులు

**గాజువాక :** గాజువాకలో ఉన్న పాఠశాలలు, కాలేజీలు బంద్ పాటించాయి. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జోన్ కార్యదర్శి ఎం.శశికుమార్, శ్రావణి, వినయ్, మహేష్, డివైఎఫ్ఐ నాయకులు శ్యామ్, అప్పలరాజు, మహేష్ బంద్‌కు నాయకత్వం వహించారు.

**అనకాపల్లి:**విశాఖ ఉక్కు ప్రవేటీకరణకు వ్యతిరేకంగా, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు బుధవారం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ అనకాపల్లిలో విజయవంతమైంది. విద్యార్థి సంఘాల విజ్ఞప్తి మేరకు అన్ని విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఎఎంఎఎల్ కళాశాల, ప్రభుత్వ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జీవీఎంసీ ఉన్నత పాఠశాల, జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాల, గాంధీ నగరం జీవీఎంసీ హైస్కూల్, గవరపాలెం హైస్కూల్, సాయి కుల్వంత్, డివిఎన్, డైట్ కళాశాల తదితర విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ఓ తదితర సంఘాల ఆధ్వర్యాన అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుండి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ భారీ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే భవిష్యత్తులో యువకులు ఉపాధి కోల్పోతారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, జిల్లా కోశాధికారి జి.తరుణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణికుమార్, పిడిఎఫ్ఓ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, డివైఎఫ్ఐ సహాయ కార్యదర్శి శివ, 50 మంది ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**చోడవరం :** విద్యాసంస్థల బంద్ చోడవరంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర నుంచి కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్వి.నాయుడు, పిడిఎస్ఓ నాయకులు రుద్రి, ఏ.మౌనిక, బి.రాజేశ్, పద్దు, ఎస్ఎఫ్ఐ నాయకులు సుందర్, ఎం.కామేష్, కె.సింహాచలం పాల్గొన్నారు. సిఐటియు నాయకులు దేవుడు నాయుడు సంఘీభావం తెలిపారు.

**కె.కోటపాడు :** ప్రజా సంఘాల నాయకులు ఎర్ర దేవుడు, గండి నాయనబాబు విజ్ఞప్తి మేరకు మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు బుధవారం బంద్ పాటించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను యువతను మోసం చేసిందని విమర్శించారు. బంద్‌కు సహకరించిన విద్యా సంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**అచ్యుతాపురం :** రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్ అచ్యుతాపురంలో జయప్రదమైంది. బుధవారం ఉదయమే విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. వందలాది మంది విద్యార్థులు తరగతులను బహిష్కరించి బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జంక్షన్ వరకు వందలాదిమంది విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ అచ్చుతాపురం ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమలలో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తామని ఇచ్చిన హామీలు నేటికీ అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, నాయకులు కె శేఖర్, బి ఉదయ్, పి వంశీ, కె శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**రాంబిల్లి :** రాంబిల్లి మండల కేంద్రంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేసి సంపూర్ణంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నాగ మంత్రి నారాయణరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి దేవుడు నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు వై రాము, డి కాశియా, వై దేముడు, సిహెచ్ పవన్ కుమార్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

**పరవాడ :** బంద్ సందర్భంగా మండలంలో పలు విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో లంకెలపాలెం, పరవాడ బాయ్స్, పరవాడ గర్ల్స్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, దేశపాత్రునిపాలెం హైస్కూల్ తదితర విద్యా సంస్థల్లో బంద్ జరిగింది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పరవాడ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి రమణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ, కిరణ్, జి.యమ తదితరులు పాల్గొన్నారు.

**నక్కపల్లి:**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.నానాజీ. డివైఎఫ్ఐ మండల నాయకులు ఎం.జాను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రమణ పాల్గొన్నారు

**పాయకరావుపేట:** పాయకరావుపేటలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ జ్యూనియర్ కళాశాల నుండి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. రమణ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణతో భవిష్యత్తులో యువకులకు ఉపాధి కోల్పోతారన్నారు. స్టీల్ ప్లాంట్ కి సొంత గనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జగిదీష్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు గోశాల రాజు పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్:** ప్రజా సంఘాల ఆద్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ నర్సీపట్నంలో విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఎస్ఎప్ఐ డివిజన్ కార్యదర్శి జి.గీతాకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమగా ఉండి రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఇటువంటి సంస్థను కాపాడుకోవడం ద్వారానే రాష్ట్ర యువతకి ఉపాది అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు పి.రాజు, ఎ.రాజు, ప్రసాద్, సాయి, రాజేష్, గౌతమ్, కుమార్ వెంకటేష్, కిరణ్, గంగాధర్, భూషణ్, శివ, గణేష్, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

**గొలుగొండ:**అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఏఎల్‌పురం గ్రామంలో విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా మాజీ ఏఐవైఎఫ్ యువజన నాయకులు మేకా భాస్కరరావు మాట్లాడుతూ, ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రం ప్రైవేటీకరణకు చేయాలని చూస్తుందని, దీన్ని అందరూ తిప్పికొట్టాలన్నారు.

**యస్.రాయవరం:** మండలంలో పలు విద్యా సంస్థలు పూర్తిస్థాయిలో బంద్ చేసినట్టు డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.నానాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర విభజన కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మండలంలో పలు ప్రభుత్వ హై స్కూల్స్, ప్రైవేటు స్కూల్స్, కళాశాలలు బందుకు మద్దతు ఇచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం నానాజీ, నాయకులు ఎం.జాను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రమణ, సురేష్, గోపి, బలరాం పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

భీమిలిలో..

చోడవరంలో..